# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

శనివారం

31 05 2025

సంపుటి 1 సంచిక 32

UDYAM / TS-09-0148996

## పాఠశాలల బలోపేతానికి అందరూ కృషి చేయాలి

**దశ , సూర్యాపేట :** ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసి, ప్రభుత్వ విద్యా వ్యవస్థను రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నెంబర్ 2 ఉన్నత పాఠశాలలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కేజీబీవీ ప్రిన్సిపాల్లకు ఐదు రోజులపాటు జరుగుతున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమ శిబిరాన్ని సందర్శించి వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గుతుందని దీని ప్రభావం వల్ల రాబోయే కాలంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ మనగడకు ప్రమాదం పొంచి ఉందన్నారు. జూన్ 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బడిబాట కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ గ్రామస్తులు, విద్యా కమిటీ, ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరే విధంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

## డీలర్లూ.. రైతులను మోసం చేయొద్దు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్టులు: ఏ డి ఏ సుజాత.

**దశ, అబ్దుల్లాపూర్ మెట్:** స్వార్థ ప్రయోజనాల కోసం డీలర్లు కక్కుర్తి పడి రైతులను మోసం చేయొద్దని, నకిలీ విత్తనాలు ఎరువులు రసాయనాలు మందులు నకిలీ అమ్మినట్టు తేలితే వారిపై పిడి యాక్టులు నమోదు చేస్తారని ఏ డి ఏ ఎం సుజాత హెచ్చరించారు. శుక్రవారం అబ్దుల్లాపూర్మెట్ రైతు వేదిక లో మండల అధీకృత డీలర్స్ కు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంరక మందుల పై వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు మందులు అమ్మేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు విధిగా తమ రికార్డులు సరిగ్గా చూసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

# ఒక పార్టీలో మూడు కుంపట్లు..

అనేక ప్రశ్నలకు దారి తీస్తోన్న కేసీఆర్ మౌనం

**మూడు శక్తులు కలిసికట్టుగా ఉంటేనే బీఆర్ఎస్ బలం**

**అంతర్గత రాజకీయాలతో బలహీన పడుతున్న బీఆర్ఎస్**

**కేసీఆర్ మౌనం వీడితేనే పార్టీకి శ్రీరామ రక్ష**

**దశ , హైదరాబాద్**

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మౌనం ఇప్పుడు అనేక ప్రశ్నలకు దారి తీస్తోంది. ఆయన నిర్ణయాల్లోని ఊగిసలాట, స్పష్టత లేకపోవడం వల్ల పార్టీ శ్రేణులు మూడు గ్రూపులుగా విడిపోయినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీశ్ రావు, కూతురు కవిత ఈ ముగ్గురికీ పార్టీలో సొంత బలగాలున్నాయి. నిజానికి, ఈ మూడు శక్తులు కలిసికట్టుగా ఉంటేనే బీఆర్ఎస్ బలంగా ఉంటుంది. కానీ, ప్రస్తుత పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉండి ప్రభుత్వాన్ని సమర్థంగా ఎదుర్కొని పార్టీని పటిష్టపరచాల్సిన సమయంలో, అంతర్గత గ్రూపు రాజకీయాలతో బీఆర్ఎస్ బలహీనపడుతోందిఇటీవలే కవిత రాసిన ఒక లేఖ బహిర్గతం కావడంతో పార్టీలోని విభేదాలు రచ్చకెక్కాయి. బీఆర్ఎస్ లో ఏదో జరుగుతోందనే వార్తలు, కథనాలు మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. పార్టీలో ఈ విభేదాలను నిలువరించడం పార్టీ పెద్దగా కేసీఆర్ కే సాధ్యం. ఆwయన చొరవ తీసుకుంటేనే ఈ పరిస్థితికి ముగింపు పడుతుంది. లేదంటే, ఈ అంతర్గత కలహాలు పార్టీని పూర్తిగా ముంచే ప్రమాదం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరాజయం తర్వాత పార్టీ గాడి తప్పినట్లు, అంతర్గత లుకలుకలు బయటపడినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. కేసీఆర్ కుటుంబ సభ్యుల మధ్యనే ఆధిపత్య పోరు నడుస్తుండడంతో పార్టీలోని కీలక నేతలతో సహా కార్యకర్తలు అయోమయంలో పడిపోయారు. కవిత

..మిగతా 2వ పేజీలో →

## ఫ్లైఓవర్ కోసం బైపాస్ పైకి..

**మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి స్పందించి ఫ్లై ఓవర్ నిర్మించాలని పలు గ్రామాల ప్రజల విజ్ఞప్తి**

**దశ , కోదాడ :** కోదాడ కట్టకొమ్ముల గూడెం గ్రామాల మధ్య కోదాడ శివార్లలో బైపాస్ రోడ్డు పై ఫ్లై ఓవర్ నిర్మించాలని బాబు నగర్ రామాపురం నరసింహపురం కట్ట కొమ్ముల గూడెం ఆర్లగూడెం రామచంద్ర నగర్ కొండాపురం ఉత్తం పద్మావతి కాలనీ తదితర గ్రామాల ప్రజలు వందలాదిమంది బైపాస్ రోడ్డుపై శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ నిత్యం ఈ రోడ్డుపై నుండి వందలాది మంది ప్రజలు ఆయా గ్రామాల నుండి కోదాడకు విద్యా వైద్యం ఉపాధి కోసం వచ్చి వెళుతుంటారని రోడ్డు దాటేటప్పుడు వేగం వచ్చే వాహనాలు ఢీకొని వందలాది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు ఇంటి నుండి బయలుదేరిన వ్యక్తి ఈ రోడ్డు దాటి ఇంటికి వచ్చేవరకు గ్యారెంటీ లేదని కన్నీటి పర్యాంతమయ్యారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు గత ప్రభుత్వంలో కూడా ఫ్లై ఓవర్ నిర్మించాలని అనేకసార్లు ఆందోళన చేసినప్పటికీ పట్టించుకోలేదని వాపోయారు ప్రస్తుతం అధికారంలో ఉన్న మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి చొరవ చూపి బైపాస్ రోడ్డుపై ఫ్లై ఓవర్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కాగా వందలాది మంది మహిళలు పురుషులు రోడ్డుపై బైఠాయించడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది విషయం తెలుసుకున్న సీఐ శివశంకర్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు బాధితులతో మాట్లాడి ధర్నా విరమింప చేశారు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాయబారపు వెంకటేశ్వర్లు పాయలు కోటేశ్వరరావు భారత వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ వివిధ పార్టీల నాయకులు మాజీ సర్పంచ్ నిగడాల వీరయ్య తిపిరి శెట్టి సత్యమయ్య చారి సందీప్ అయి నాల ఉపేందర్ నాగేశ్వరరావు వెంకటేశ్వర్లు బొబ్బయ్య తిప్పిరి శెట్టి వీరయ్య రాయబారపు రాజేష్ పది గ్రామాల ప్రజలు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు..

## అవతరణ దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

**అదనపు కలెక్టర్ బి.ఎస్ లత**

**దశ , జగిత్యాల:** జగిత్యాల జిల్లాలో నిర్వహించు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ బి.ఎస్ లత సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో

సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జరుగుతాయని, జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించి ఫ్లాగ్ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు.

# సీజనల్ వ్యాధులు విస్తరించే ప్రమాదం..

**దశ , రంగారెడ్డి :** తెలంగాణలో వానల తీవ్రత పెరిగిన నేపథ్యంలో.. వైద్య ఆరోగ్య సంస్థలు ప్రజలను వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాయి. మున్ముందు భారీ వానలు కురుస్తాయనే నివేదికల దృష్ట్యా.. వ్యాధుల విస్తరణ నిరోధానికి పలు నిర్దేశాలు చేశారు. దోమ తెరల వాడకం, నీటి నిలువ తొలగించడం, శుద్ధి చేసిన నీటిని తాగడం, బహిరంగ ఆహారాలు నివారించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటివి ముఖ్యమని పేర్కొన్నారు. జ్వరం, దగ్గు వంటి అనారోగ్య లక్షణాలున్న వారు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలని.. అత్యవసరాలలో 108కి డయల్ చేయాలని సూచించారుతెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరించింది. రానున్న రెండు రోజుల్లో భారీ వర్ష సూచన ఉండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలంగాణ ప్రజా వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది. వర్షాకాలంలో

సాధారణంగా పెరిగే దోమల బెడదను నివారించడం అత్యంత ముఖ్యం. దీని కోసం, ఇళ్లలోని తలుపులు, కిటికీలకు మస్కిటో నెట్‌లను అమర్చుకోవడం ద్వారా దోమల ప్రవేశాన్ని అరికట్టవచ్చని వైద్య శాఖ సూచించింది. అంతేకాకుండా, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇళ్ల పరిసరాల్లోని నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని నియంత్రించవచ్చు. ఈ చర్యలు డెంగ్యూ, మలేరియా వంటి

..మిగతా 2వ పేజీలో →

## ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీ పర్యటన వాయిదా

**దశ , హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన వాయిదా పడింది. దీంతో మంత్రి వర్గ విస్తరణ, టీ పీసీసీ పోస్టుల భర్తీ ఆశావహులకు ఆడియాశలు ఎదురయ్యాయి. సీఎం ఢిల్లీకి వెళ్లగానే మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం వెలువడుతుందని అందరూ భావించారు. కానీ ఆయన పర్యటన అర్ధాంతరంగా వాయిదా పడడంతో ఆశావహులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.అయితే ఢిల్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డికి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్‌కు పార్టీ హైకమాండ్ నుంచి పిలుపు అందింది. శుక్రవారం పార్టీ వ్యవహారాలపై చర్చించాలని హైకమాండ్ వారికి సూచించింది. కానీ రేవంత్ పర్యటన వాయిదా పడడంతో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.గత ఆదివారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి, టీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమావేశమైన సంగతి తెలిసిందే. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో మరిన్ని చర్చలు, సమావేశాల కోసం సోమవారం వారిని ఢిల్లీలోనే ఉండమని కోరారు. కానీ వారి అపాయింట్‌మెంట్ లభించకపోవడంతో.. ముఖ్యమంత్రి రేవంత్ నిరాశతో హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. అయితే సీఎం, పీసీసీ ప్రెసిడెంట్ శుక్రవారం ఢిల్లీకి రావాలని ఏఐసీసీ మళ్లీ ఆదేశించింది. సీఎం మాత్రం ఢిల్లీకి వెళ్లకుండా హైదరాబాద్‌లోనే ఉండిపోయారు. అయితే ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అపాయింట్‌మెంట్ ఖరారు కాకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీ వెళ్లలేదని గాంధీ భవన్ వర్గాల ద్వారా తెలిసింది.

# సిటీలో మరో రెండు ఫ్లై ఓవర్లు

**దశ , హైదరాబాద్ :** తెలంగాణలోని రేవంత్ సర్కార్ హైదరాబాద్ నగరం అభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకుంటుంది. భాగ్యనగరంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని భావించిన రేవంత్ సర్కార్..సుమారు 7 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చుతో.. హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్ట్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా దాదాపు రూ.1740 కోట్ల ఖర్చుతో.. ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్డు డెవలప్‌మెంట్ పనుల కోసం జీహెచ్ఎంసీ.. ఇప్పటికే టెండర్లు పిలిచింది. ఇక ఇప్పటికే నగరంలో పలు ఫ్లైఓవర్లు ప్రారంభం కాగా.. మరి కొన్ని నిర్మాణంలో ఉన్నాయి.ఇదిలా ఉండగా తాజాగా జీహెచ్ఎంసీ హైదరాబాదీలకు మరో శుభవార్త చెప్పింది. నగరంలో బాగా రద్దీ ఉండే రెండు ప్రాంతాల్లో.. మరో రెండు ఫ్లై ఓవర్లు, ఒక అండర్‌పాస్ నిర్మాణ పనుల కోసం తాజాగా టెండర్లను ఆహ్వానించింది. ఈ మూడింటి నిర్మాణ పనులకు.. ఒకే ప్యాకేజీ కింద టెండర్లు ఆహ్వానించింది. వీటి నిర్మాణానికి సుమారు రూ.368 కోట్లుగా జీహెచ్ఎంసీ అంచనా వేసింది. వీటికి జూన్ 18న టెండర్లు సమర్పించడానికి చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. ఈ మూడింటి నిర్మాణంతో.. హైసిటీ పనుల్లో మరో అడుగు ముందుకు పడినట్లయింది.జీహెచ్ఎంసీ తాజాగా నిర్మించదలిచిన రెండు ఫ్లైఓవర్ల విషయానికి వస్తే.. ఒకటి బంజారాహిల్స్ ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి జీవీకే మాల్ రోడ్డు వైపు రెండు లేన్లతో కాగా.. మరోకటి జంక్షన్ వద్ద 2 లేన్ల అండర్‌పాస్, 3 లేన్లతో ఫ్లై ఓవర్ నిర్మించనుంది. ఇప్పుడు ఈ పనులకు జీహెచ్ఎంసీ టెండర్లు ఆహ్వానించింది.ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద నిర్మించ తలపెట్టిన ఫ్లై ఓవర్ నిర్మాణం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3 మీదుగా అటు నుంచి జీవీకే మాల్‌వైపు కొనసాగుతంది. రెండు లేన్లతో ఒక అండర్‌పాస్ నిర్మించేందుకు జీహెచ్ఎంసీ ప్రణాళికలు రచిస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే.. ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి శ్రీనగర్ కాలనీ రూట్‌లో వెళ్లే వారికి చాలా ఉపయోగకరంగా ఉండనుంది. పది మీటర్ల వెడల్పుతో ఈ అండర్‌పాస్ నిర్మించనున్నారు. అంతేకాక ఇక్కడ ఫుట్‌పాత్‌లతోపాటు రెండు లక్షల నీటి సామర్థ్యంతో భూగర్భ సంప్ నిర్మాణం కూడా చేపట్టనున్నారు.బంజారాహిల్స్ ముగ్ధ జంక్షన్ నుంచి మీదుగా ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వైపు 3 లేన్లతో దీన్ని నిర్మించనున్నారు. ఈ ఫ్లైఓవర్ వెడల్పు 12 మీటర్లుగా ఉండనుంది. ఈ ప్యాకేజీలో నిర్మాణం చేపట్టబోయే ఈ ఫ్లైఓవర్లు ప్రయాణ మార్గం ఒకే దిశగా సాగనుంది. ఇవి అందుబాటులోకి వస్తే.. ఈ రద్దీ ఏరియాల్లో ట్రాఫిక్ కష్టాలు తీరతాయంటున్నారు.ఈ పనుల ప్రారంభం కోసం జీహెచ్ఎంసీ టెండర్లను ఆహ్వానించింది. దీనిలో

ఎంపికయ్యే ఏజెన్సీయే.. ఈ ఫ్లైఓవర్ల నిర్మాణానికి సంబంధించిన సర్వే, డిజైన్‌తో సహా మొత్తం పనులు చేయాల్సి ఉంటుంది. రెండేళ్ల వరకు ఏవైనా మరమ్మతులు అవసరమైతే చేయాల్సి ఉంటుంది.



మంచాల గ్రామంలో శ్రీశ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు

(దశ , మంచాల )

దశ
నిజం.. నిర్భయంగా..

# నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

దశ, హైద్రాబాద్ : పొగతాగడం ఆరోగ్యానికి హానికరం. ప్రతీ సినిమా మొదలయ్యే ముందు వచ్చే ఈ మాటలు విని ఎంత మంది పొగ మానేస్తారో అర్థం కాదు. పొగ తాగడం వల్ల హానికరం అని తెలిసి కూడా మానలేకపోతున్నవారు చాలామందే ఉన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని మే 31న ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి ఈ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తోంది. కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే. పొగాకు వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయడంకోసం అవగహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.ఈ అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారతదేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గింది.

02
శనివారం
31-5-2025
WWW.
DASHANEWS
.COM

## రాజకీయ చదరంగం -నాయకుల అదృష్టం

రాజకీయ చదరంగం,
నాయకుల అదృష్టం.. పార్టీల రణరంగం
ఛలోక్తులు, విడిపోయి విమర్శలు
పదవుల ఆశతో పార్టీమార్పిడులు

అధికార మార్పిడి జరిగినప్పుడు
అటు ఇటుగా నాయకులు
అవసర నిమిత్తమో.. అభద్రత భావమో

కాని, కార్యకర్తల కన్ఫ్యూషన్
అయినా నాయకునిపై నమ్మకం
భవిష్యత్ బాగుంటుందని
నచ్చ చెప్పుకొనే ప్రయత్నం

జండాలు కట్టినోళ్లు.. జై జేలు కొట్టినోళ్లు
గుర్తులు పట్టుకొని తిరిగినోళ్లు
ప్రతిసారి పార్టీ మారినోళ్లను చూసి

ప్రజలు వారిని చులకనగాచూడరా
పైసలిస్తే సరిపెట్టుకుంటారా
ఓటును అమ్ముకుంటారా, లేక
ఓడగొట్టి పగతీర్చుకుంటారా

ఈ పోటీ ప్రపంచములో
అలుపెరగని పోరాటం,
నాయకులు, కార్యకర్తలు
ఆస్తులమ్ముకుంటారు
అధికారం కోరుకుంటారు

ఓడెవారెవరో.. గెలిచేవారెవరో
నిలిచేవారెవరో.. నిలదొక్కుకొనే వారెవరో

ఈ రాజకీయ చదరంగములో
నిత్య విద్యార్థులుగా కొందరు
పావులవలె కదులుచుంటారు,తమ
పనితనాన్ని పరీక్షించుకుంటారు

రచన:
కడెం. ధనంజయ, చిత్తలూరు

## 'పెద్ద అంబర్పేట'లో విలీనమైన సాయి నగర్

**దశ,పెద్ద అంబర్పేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, పోచంపల్లి మండల పరిధిలోని సాయి నగర్ గ్రామాన్ని పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఈ మేరకు తెలంగాణ మున్సిపల్ చట్టం 2025ఉత్తర్వులను అనుసరించి శుక్రవారం గ్రామపంచాయతీ రికార్డులను మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి స్వాధీనం చేసుకుని సిబ్బందికి తగు సూచనలు చేశారు. గ్రామపంచాయతీ బోర్డును పురపాలక సంఘం వార్డు కార్యాలయముగా మార్పు చేశారు. ఈ గ్రామం హయత్ నగర్ భాగ్యలత కాలనీలో కల్పంచ శాంతినగర్ కు పక్కన ఉన్నది.

## 75 శాతం హాజరు తప్పనిసరి

- లేకుంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందేందుకు అర్హత ఉండదు .
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ బాలకిష్టారెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం

**దశ , హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుచేస్తున్న సంగతి తెలిసిందే. అయితే విద్యా సంవత్సరంలో కనీసం 75 శాతం హాజరు లేకుంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందేందుకు అర్హత ఉండదని తాజాగా ఆయా యూనివర్సిటీల వీసీలతో నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ బాలకిష్టారెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఏడు యూనివర్సిటీల వీసీలతో మే 29న సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిగ్రీలో విద్యార్థులకు కనీసం 75 శాతం హాజరు ఉండాలని నిర్ణయించారు. లేకుంటే ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉండదని స్పష్టం చేశారు.నిజానికి, గతంలోనే ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ అది అమలు కావడం లేదని ఈ సమావేశంలో వీసీలు ప్రస్తావించారు. దీంతో ఈసారి మాత్రం హాజరును ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు తప్పనిసరి చేయాలని, ఈ ఆదేశాలను అమలు చేయాలని నిర్ణయించారు. ఇలా చేయడం వల్ల కొంత వరకు విద్యానాణ్యత పెరుగుపడే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే ఇప్పటివరకు మూడేళ్ల డిగ్రీకి 150 క్రెడిట్లు ఉన్నాయి. వాటిని 142కు కుదించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.ఆంధ్రప్రదేశ్ లా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025 (ఏపీ లాసెట్) హాల్‌టికెట్లు తాజాగా విడుదలయ్యాయి. ఈ మేరకు ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (APSCHE) వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్, హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇక రాత పరీక్ష జూన్ 5న రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నారు.

## బేబి హారికకు గద్దర్ అవార్డ్ !!!

**దశ, రంగారెడ్డి :** తెలంగాణ ప్రభుత్వం తెలుగు చిత్ర పరిశ్రమకు అందిస్తున్న ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డ్స్ లో మెర్సీ కిల్లింగ్ లో నటించిన బేబి హారిక ఉత్తమ చైల్డ్ ఆర్టిస్టులుగా గద్దర్ అవార్డ్స్ కు ఎంపికయ్యారు. సాయి సిద్ధార్ద్ మూవీ మేకర్స్ బ్యానర్ పై తెరకెక్కిన సినిమా "మెర్సీ కిల్లింగ్" సాయి కుమార్, పార్వతీశం, ఐశ్వర్య, బేబి హారిక ప్రధాన పాత్రల్లో సిద్ధార్ద్ హరియల, మాధవి తాలబత్తుల నిర్మించిన ఈ సినిమాకు వేదుల బాల కామేశ్వరి సమర్పించారు. సూరపల్లి వెంకటరమణ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాకు జి.అమర్ సినిమాటోగ్రాఫి అందించగా ఎం.ఎల్. రాజా సంగీతం సమకూర్చారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఆధారంగా తెరకెక్కిన చిత్రం మెర్సీ కిల్లింగ్ . స్వేచ్ఛ అనే అనాధ బాలిక తనకు న్యాయం జరగాలంటూ

ఈ కథ ప్రారంభం అవుతుంది. గత ఏడాది ఏప్రిల్ 12న థియేటర్స్ లో విడుదలై మంచి విజయం సాధించింది. ఎమోషనల్ కథ కథనాలను సమాజంలో జరిగే కొన్ని సంఘటనలను తీసుకొని చేసిన మెర్సి కిల్లింగ్ సినిమా ప్రస్తుతం అహాలో స్ట్రీమింగ్ అవుతోంది.

## భారీ శబ్దాలు చేసే సైలెన్సర్ల ధ్వంసం

**దశ,ఎల్బీనగర్:** కాలుష్యాన్నిఅరికట్టడంతోపాటు రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తూ భారీ శబ్దాలు చేసే వాహనాల సైలెన్సర్లను పోలీసులు ధ్వంసం చేశారు. రాచకొండ ట్రాఫిక్ పోలీసులు మోడిఫైడ్ మోటర్ సైకిల్ సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లను శుక్రవారం పోలీసులు ధ్వంసం చేశారు. పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టడం, నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (NCAP), మిషన్ లైఫ్ క్యాంపెయిన్‌కు అనుగుణంగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాలతో కాలుష్యానికి కారణమవుతున్న మోటర్ సైకిల్ సైలెన్సర్ల స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. స్పెషల్ డ్రైవ్‌ల్లో పోలీసులు 2325 కేసులు నమోదు చేసి, 1297 మోడిఫైడ్ సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎల్బీ నగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ డీసీపీలు మల్లారెడ్డి, శ్రీనివాసులు, ఉషారాణి, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషారాణి, ఏడీసీపీ శ్రీనివాస్ కుమార్, ట్రాఫిక్ ఏఎస్పీ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## జడ్జ్ కావాలంటే న్యాయవాదిగా పనిచేయవలసిందే

**సుప్రీంకోర్టు సూచన హర్షనీయం**

**దశ , అబ్దుల్లాపూర్‌మెట్ :** భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు నూతనంగా న్యాయమూర్తులుగా నియమితులయ్యే వ్యక్తులు జ్యుడిషయరి వ్యవస్థలో పనిచేయాలనుకొనే జ్యుడిషయరీ ఆఫీసర్లంతా కనీసం మూడు సంవత్సరాలు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి ఉండాలని సూచించడం హర్షనియమని లాయర్స్ ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి స్వామి అన్నారు. సివిల్ జడ్జిలుగా న్యాయమూర్తులుగా నియమితులయ్యే వ్యక్తులకు న్యాయవాదులుగా పనిచేసిన అనుభవం ఉంటే న్యాయవాదుల యొక్క

సమస్యలు తెలుస్తాయి కాబట్టి అందుకు అనుగుణంగా జడ్జిమెంట్లు ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరుగుతుందని , అప్పుడు కోర్టులో బెంచ్ కి న్యాయవాదూల సంఘాల అసోసియేషన్ కీ స్నేహపూర్వక వాతావరణం ఉంటుందన్నారు . న్యాయవాదులు అందరికీ వృత్తిపరమైన అభివృద్ధి కూడా ఉంటుందని తెలియజేశారు.

## సీజనల్ వ్యాధులు విస్తరించే ప్రమాదం..

**మొదటి పేజీ తరువాయి**

దోమల ద్వారా సంక్రమించే వ్యాధులను గణనీయంగా తగ్గిస్తాయి.ఇక.. తాగునీటి విషయంలో కూడా అప్రమత్తత అవసరం. ఫిల్టర్ చేసిన లేదా కాచి వడగట్టిన నీటిని మాత్రమే తాగాలని ఆరోగ్య శాఖ నొక్కి చెప్పింది. బయటి ఆహార పదార్థాలను తినడం మానుకోవాలని, వాటి వల్ల జీర్ణాశయ సంబంధిత ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది.వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలుప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. తరచుగా చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలున్న వారికి దూరంగా ఉండాలి. ఒకరినొకరు కలుసుకునేటప్పుడు చేతులు కలపడం వంటివి తగ్గించుకోవాలి. ఒకవేళ అలా చేస్తే, తప్పనిసరిగా శానిటైజర్‌తో చేతులను శుభ్రం చేసుకోవాలి.ఎవరికైనా దగ్గు, జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి వంటి సీజనల్ వ్యాధి లక్షణాలు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చాలని వైద్య శాఖ విజ్ఞప్తి చేసింది. అత్యవసర పరిస్థితుల్లో 108కి కాల్ చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కేంద్రాలు అన్ని రకాల వైద్య సదుపాయాలతో, సిబ్బందితో సిద్ధంగా ఉన్నాయని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరింది.

## సర్పంచ్ పదవి పై ఆశలు పెట్టుకున్న ఆశావాహులు

## గొప్పలకు పోయి అప్పలపాలు కాకండి

గొప్పలకు పోయి అప్పల పాలవుతూ తిప్పలు పడుతున్న కొంతమంది రాజకీయ ఆశావాహుల కన్నీటి గాధ ఇది. పైసా ఖర్చు చేయనిదే అనుచరులు వెంటరారు. సంవత్సరాల కొద్ది సాధిన.. ఒక్కరోజు పెట్టకపోతే... వాడి నాయకుడి... బతుకు బస్టాండ్‌అవుతుంది. ఖద్దరు వెనుక కన్నీటి వ్యథ లెన్నోఉంటాయి బయటికి చెప్పకోలేక ఎంతో మంది ఉంటారు. సర్పంచ్ ఎన్నికలపై గ్రామాల్లో జోరుగా చర్చమొదలయ్యింది. చిన్నగ్రామపంచాయతీ అయితే 15 నుండి 25 లక్షలు పెద్ద గ్రామపంచాయతీ అయితే 50 నుండి 60 లక్షలు ఖర్చుపెట్టి సర్పంచ్ గా గెలిచాకఅరకొర నిధులతో సతమత మవుతుంటారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అరకోర నిధులతో బుగ్గలు (వీధి దీపాలు) వేయడం,చెడిపోయిన బోర్లలనూ రిపేర్ చేయడం, ఉన్న నిధులతో సీసీ రోడ్ వేయడం అదనంగా బోర్లు వేయించడం మోటీలు తీయడం... రాష్ట్ర ప్రభుత్వం నుండి అభివృద్ధికి నిధులు రాక పొద్దుగాల 6 గంటలకు లేసి తయారు అయ్యి.ఊరంతా తిరిగి పనులు చూడాల్సింది ఎమ్మెల్యే గారింటికి పోయి రాత్రి పది దాకా ఎమ్మెల్యే ఏ ఊరికి ప్రోగ్రామ్ ఉంది అంటే ఆ ఊరికి పోయి రోజు మొత్తం ఛాయల మీద, సమోసల మీద బతికి రాత్రి పదింటికి ఇంటికి వచ్చి బుక్కె డంత బువ్వ తినాలి ఈ సర్పంచ్ మనోడే మన వర్గమే మన అభిమానే అని ఏ రెండు ఏండ్లకో,మూడు ఏండ్లకో ఒక్క పని ఇస్తే దానికి ఎం బి రీకార్డులకు పర్సెంటేజ్ లు కమిషన్ ఇచ్చి ఒక్క పని సీసీ రోడ్ లేదా ఇంకా ఏదైనా చిన్న పని ఇస్తే దానికి పైసలు బయట నుండి రెండు రూపాయలు కోన్ని గ్రామాల్లో అయితే రూ 5 కు వడ్డికి తెచ్చి ఆ పని చేపించినాక ఆ పని మొత్తం అయ్యాక ఆ పని పైసల కోసం మళ్ళీ ఆఫీసుల చుట్టూ తిరిగి ఏడాదికో వాడిని,వీడిని బతిలాడి చేసిన పని పైసలు మంజూరు చేస్కాని మిత్తి తెచ్చిన కాడా కట్టంగా సర్పంచికి మిగిలేది ఎం లేదు.. ఇక 5 ఏళ్లలో వచ్చే పండగలకు నవరాత్రులకీ తెల్లారితే ఎవరు ఏమీ అడుగు తారో తేలువది, సచ్చిన సర్పంచ్ బతికినా సర్పంచ్ అలుమగలు కోట్లాడుకున్న సర్పంచ్ పండుగలకు లైట్లు, కనీస వసతులు ఏర్పాటు చేపించడం కోసం జేబుల నుండి సొంత పైసలు తీసి పెట్టడం వాటికి సంబంధించిన బిల్ వస్తే తీసుకోవడం లేకపోతే వదిలెయ్యడం.. బజారులో మంచి మోరం పోయలేదని పిర్యాదు చేయడం లాంటివి వల్లవాటికి కూడా జేబుల నుండి సొంత పైసలు తీసి పెట్టడం మళ్ళీ రాత్రి ఎవడో ఒకడు తాగి వచ్చి కావాలని సర్పంచిని కుక్క బూతులు తిట్టడం ఇవన్నీ భరిస్తూ. ప్రభుత్వం నుండి పైసలు రాక భూమి ఉన్నోడు భూమి అమ్ముకొని, భూమి జాగా ఆస్తులు లేని వాడు ఎం పని చేస్తలేడు అని జనం చేతిలో తిట్లు తినుకుంటు బతుకుతున్నారు... ఇది తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గ్రామ సర్పంచుల రోజువారి 5 ఏళ్ల జీవితం పరిస్తితి ఇలాగే ఉంటే యువత రాజకీయాల్లోకి ఎలా వస్తది వ్యవస్థలో మార్పు ఎలా తెస్తది. డబ్బులు తీస్కానిది జనం ఓటు వెయ్యరు కమిషన్ తీస్కానిది ఏఈ , ఈ ఈ ఎంబీ ఇవ్వరు ఎంబి తెచ్చినంక గ్రామ పంచాయతి కార్యదర్శికి ఉపసర్పచి సిగ్నేచర్ చెక్ పైన పెట్టాలంటే 2% నుంచి 4% వరకు ఇవ్వాలి.. మళ్లి ఉపసర్పంచికి 5% ఇవ్వాలి, అప్పడప్పడో, పండుగకో, ఎం పి వో కఎం పి డి వో కు కూడా ముట్టే జెప్పాలే లేకపోతే పల్లెప్రగతిలో మార్కులు ఎయడు. ఇలాంటి పరిస్తితిలు పెట్టుకొని ఎలా ఒక ఆత్మభిమానం ఉన్న ఉన్న వ్యక్తి ప్రస్తుత రాజకీయాల్లోకి రాగలడా!

పనులు చెయ్యకపోతే అధికారులు సస్పెండ్ చేస్తామని బెదిరింపులు, వేధింపులు... ఈ బెదిరింపులకు, వేధింపులకు పదవి పోతాదని భయంతో, బాధతో,పరువు పోతాదాని అప్పులు తెచ్చి పనులు చేసి, అప్పల వాళ్ళకి అప్పలు కట్టలేక మిత్తిలు కట్టలేక కుటుంబాలకు దూరంగా,ఇటు గ్రామంలోని ప్రజలతో ఉన్నట్టు లేక కుటుంభం తో ఉన్నట్టు లేక అప్పల్లోల్లకు సమాధానము చెప్పలేక మెంటల్ టెన్షన్ లోతో తిరుగుతున్నారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం సర్పంచ్ ల కుటుంబాలను రోడ్ ల మీదకు తెచ్చి బిల్లులు ఇవ్వలేక ఆగం చేసింది బి జె పి ప్రభుత్వం మాట ఇచ్చింది కానీ ఇంకా మాట నిలబెట్టుకోవట్లేదు, మాట నిలబెట్టుకోవాలని కోరుకుంటున్నాము...

కాంగ్రెస్ ప్రభుత్వం మాటఇచ్చింది బిల్లులు ఇవ్వాలని వేడుకున్నాం.

ఎద్దు ఏడ్చిన ఎవుసం ఏసుకు రాదు

సర్పంచ్ లను ఏడిపించిన ప్రభుత్వాలు బాగుపడవు

ఆలోచన చేయవలసిన అవసరం ఉంది రాజకీయ పార్టీలు...

(దశ, రంగారెడ్డి)

## ఒక పార్టీలో మూడు కుంపట్లు..

**మొదటి పేజీ తరువాయి**

రాసిన లేఖ ఈ గ్రూపు తగాదాలకు కొత్త మలుపునిచ్చింది. కవిత అమెరికా పర్యటనకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో నాటకీయంగా ఈ లేఖ లీక్ కావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ లీకు వెనుక ఎవరున్నారనేది పక్కన పెడితే, అసలు కవిత పార్టీకి సంబంధించిన అంశాలపై లేఖ రాయాల్సినంత తీవ్రమైన పరిస్థితులు బీఆర్ఎస్ లో ఏర్పడ్డాయనేదే ఇక్కడ కీలకం. ఈ లేఖ తానే రాశానని కవిత స్వయంగా అంగీకరించడం పార్టీలో విభేదాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో తెలియజేస్తోంది.పార్టీ బలోపేతం కోసమే తాను ఈ లేఖ రాశానని కవిత చెప్పినప్పటికీ, దీనికి మీడియాలో, సోషల్ మీడియాలో లభించినంత విస్తృతమైన చర్చ క్షేత్రస్థాయిలో జరగలేదు. ప్రజలు కూడా ఇదంతా ఒక కుటుంబ డ్రామాగానే ఉందని,కేసీఆర్ జోక్యం చేసుకుంటే అంతా సమిసిపోతుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో కూడా కవితకు ఆశించిన మద్దతు లభించలేదు. ఈ లేఖ వెనుక అదృశ్య శక్తులు ఉన్నాయనే అభిప్రాయం బీఆర్ఎస్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.ఎయిర్‌పోర్ట్‌లో కవిత విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని చెప్పడంపై పార్టీ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో 'కవితసీఎంసీఎం' అంటూ ఆమె అనుచరులు చేసిన నినాదాలను కవిత వారించి ఉంటే, ఆమె కేసీఆర్‌ను ధిక్కరించలేదనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో కలిగి, ఆమెకు కొంత మద్దతు లభించేది.బీఆర్ఎస్ లో కేటీఆర్, కవిత, హరీశ్ మధ్య ఆధిపత్య పోరుపై భిన్నమైన అభిప్రాయాలున్నాయి. కేటీఆర్ ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉండడంతో పార్టీలో ఆయనది ప్రత్యేక స్థానం. ఇదే సమయంలో పార్టీలో హరీశ్ రావుకు కూడా కీలక ప్రాధాన్యతే ఉంది. ఉద్యమ సమయం నుంచి పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్న హరీశ్ రావుపై ఎవరూ ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఉంటే బాగుంటుందనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో ఉంది. పార్టీలో కుటుంబ సభ్యుల మధ్యే పోరు నడుస్తుండడంతో కేసీఆర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారని పార్టీ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.హరీశ్ బలమేంటో, తనయుడి బలహీనత ఏంటో బాగా తెలిసిన కేసీఆర్ కొడుకు కేటీఆర్ ను ఒక మెట్టు ఎక్కించడానికి, మేనల్లుడు హరీశ్ ను ఒక మెట్టు దించే ప్రయత్నాలు గతంలో అనేకసార్లు చేశారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్

భారీ విజయం సాధించిన తర్వాత హరీశ్ కి మంత్రి పదవి ఇవ్వకుండా దూరం పెట్టారు. దీంతో ఆయన సిద్దిపేటకే పరిమితమయ్యారు. ఆ తర్వాత ఏకపక్షంగా కేటీఆర్ కి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కట్టబెట్టారు.అప్పుడు కూడా కేటీఆర్ నాయకత్వంలో పని చేయడానికి తాను సిద్ధమని హరీశ్ తన విధేయతను ప్రకటించారు. అనంతరం ఇంటా బయట తీవ్ర ఒత్తిడి రావడంతో హరీశ్ కి మంత్రి పదవి ఇచ్చినా... అంతకు ముందు నీటిపారుదల మంత్రిగా మంచి పేరు తెచ్చుకున్న హరీశ్ కు ఆ శాఖ కాకుండా ఆరోగ్య శాఖ బాధ్యతలు ఇచ్చారు. పార్టీలో ట్రబుల్ షూటర్ గా పేరున్న హరీశ్ కు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఇతర ఉప ఎన్నికల్లో ప్రాధాన్యత తగ్గించడంతో అప్పుడు బీఆర్ఎస్ బలహీనపడగా, బీజేపీ బలపడింది.కవిత ఎదురు తిరగడానికి అనేక కారణాలున్నాయి. తనను లిక్కర్ కేసులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అరెస్టు చేస్తే కేసీఆర్ ఆ పార్టీపై వెనకడుగు వేస్తున్నారనే అభిప్రాయం కవితలో ఏర్పడింది. రజతోత్సవ సభలో కేసీఆర్ బీజేపీపై తేలికపాటి విమర్శలు చేయడం వల్ల పార్టీపై ప్రజల్లో అనుమానాలు పెరిగాయని ఆమె తండ్రికి రాసిన లేఖలో చెప్పడానికి ఇదే ప్రధాన కారణం.రాజకీయంగా బీజేపీ కోసం తనను బలిపశువు చేశారనే ఆగ్రహం ఆమెలో ఉంది. తనను అరెస్టు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించిన పార్టీ తాను జైలు పాలైనా పట్టించుకోలేదనే బాధా కవితలో ఉంది.లిక్కర్ స్కాంలో జైలు నుంచి వచ్చిన తర్వాత కవిత ఇంటికే పరిమితం అవుతారని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తే ఆమె సామాజిక తెలంగాణ నినాదంతో ప్రజల్లోకి వచ్చారు. తెలంగాణ తల్లి విగ్రహం, రాష్ట్ర గేయంపై ఆమె తెలంగాణ జాగృతి తరఫున పలు నిరసనలు చేపట్టినా పార్టీ నుండి ఆమెకు మద్దతు లభించలేదు. దీనికి కేసీఆర్, కేటీఆర్ కారణమని భావన ఆమెలో ఏర్పడింది.పార్టీలో ఇంత గందరగోళానికి ప్రధాన కారణం బీఆర్ఎస్ లో కేసీఆర్ తర్వాత ఎవరు అనే అనవసర ప్రశ్న రావడమే. పార్టీ రజతోత్సవ సభను కూడా అంతా తానై నడిపించిన కేసీఆర్ పై ఇలాంటి సందేహాలు రావడం పార్టీకి కీడు చేస్తున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకైనా పార్టీలో ఇలాంటి ప్రశ్నలు మళ్లీ తలెత్తకుండా కేసీఆర్ మౌనం వీడి కచ్చితమైన సందేశాన్ని పార్టీకి ఇస్తే బీఆర్ఎస్ కు అదే శ్రీరామరక్ష.